
'ఆటా' కథల పోటీల్లో ఎంపికైన కథ

-బి.హెచ్.వి.నాగేశ్వరరావు



# అతి ముఖ్యమైన వ్యక్తి

*ప్రభుత్వరంగ సంస్థ అధినేత తన క్రింది ఆఫీసు విజిట్ చేయడం అంటే సామాన్యమైన విషయమేం కాదు. క్రింది ఆఫీసు వాళ్ళకి అది చాలా పెద్ద బాధ్యతే. చాలారోజుల ముందునుంచే మొదలవుతుంది హడావుడి. బాస్‌ని ఏ లోటూ రాకుండా రాచమర్యాదలతో తిరిగి సాగనంపే వరకూ టెన్షన్ ఉంటుంది మరి.*

రామాపురంలో ఉన్న ఆఫీసు సాధారణంగా నిశ్శబ్దంగా, నీరవంగా ఉండేది. కానీ హఠాత్తుగా దాంట్లో చలనం మొదలయ్యింది. ఉద్యోగులందరూ హడావుడిగా పెద్ద బాస్ విజిట్‌కి సంబంధించిన ఏర్పాట్లలో మునిగిపోయారు.

గోడలన్నింటికి కొత్త సున్నం వేశారు. కడిగిన నేలనే మరల మరల కడిగారు. పెద్ద బాస్‌కి స్వాగతం పలికే అనేక బ్యానర్లు అంతటా వేలాడదీశారు. అతను తినడానికి, ఉండడానికి పేరున్న హోటల్సు బుక్ చేశారు. రామాపురం ఆఫీసు బాస్ (ఇతన్ని చిన్న బాస్ అందాం) దగ్గరుండి ఏర్పాట్లన్నీ పర్యవేక్షించాడు.

అందరూ ఎదురుచూసిన రోజు రానే వచ్చింది. పెద్ద బాస్ సపరివార సమేతంగా విచ్చేశారు. కారు దిగుతూనే తనకు స్వాగతం పలుకుతున్న బ్యానర్లను చూసి చిరునవ్వుతో తల పంకించారు. చిన్న బాస్ వినయంగా వంగి పూల బొకే చేతికిచ్చి అతనికి స్వాగతం పలికారు.

పెద్ద బాస్ ఆఫీసు రూములోకి అడుగుపెట్టగానే స్టాఫంతా వినయంగా లేచి నిల్చుని నమస్కారాలు చేసారు. కానీ పనిలో మునిగిపోయి కూర్చున్న రామారావుపై దృష్టి పడగానే పెద్ద బాస్ ముఖం ఒక్కసారి సీరియస్ అయింది.

రామారావు ఐదారు సెకన్ల దీర్ఘ విరామం తరువాత మాత్రమే పెద్ద బాస్ రాకను గమనించి, నిల్చుని, నమస్కారం చేసాడు.

పెద్ద బాస్ ముఖంలో కొద్దిగా చికాకు కనిపించింది. 'అందరూ తను అడుగుపెట్టగానే లేచి నిల్చుంటే, వీడేమిటిలా?'అనుకున్నాడు. 'అదీగాక, అతగాడి టేబిల్ నిండా అన్ని ఫైల్స్ ఏమిటి? అతగాడి ముందు అందరు కష్టమర్స్ ఏమిటి?' 'అయినా చిన్న గుమస్తాని తిట్టడం తన డిగ్నిటీకి భంగం. తన మనసులోని భావనని పసిగట్టి అతన్ని తూర్పారబట్టేందుకు తన క్రింద ఎందరో అధికారులున్నారు.'

'అయినా చిన్న సలహాలా ఆ మనిషికి బుద్ధిచెప్పాలి' అనుకున్నాడు. 'టేబిల్ మీద ఇన్ని ఫైళ్ళు పెండింగ్‌లో ఉన్నాయేమిటి? దీనినిబట్టి నువ్వసలు పనిచేయడం లేదని గదా తేలుతోంది?'అని గద్దించాడు.

రామారావు వినయంగా సమాధానం చెప్పాడు. 'సార్! నామీద పని వత్తిడి విపరీతంగా ఉంటోంది. దాదాపు అన్ని ఫైళ్ళూ నాకే అప్పచెప్తారు. ఒక్కడ్నే మొత్తం పని అంతా ఎలా పూర్తిచేయను? అయినా నా శక్తివంచన లేకుండా చేస్తూనే ఉన్నాను. కష్టమర్లందరిని వరుసగా పని పూర్తిచేసి పంపిస్తున్నాను.'

రామారావు జవాబు చెప్పగానే అందరూ అవాక్కయ్యారు. అంత పెద్ద బాస్‌కి చిన్న గుమస్తా జవాబు చెప్పడమే. కానీ పెద్ద బాస్ చాలా దయతోనే తీసుకున్నట్లున్నాడు. "పని వత్తిడి ఈరోజుల్లో అందరికీ కామనైపోయింది. నువ్వు టైము- మానేజిమెంటు టెక్నిక్స్ నేర్చుకోవాలి. ఊరకే పని పెండింగ్ వుంచి కంప్లైంట్ చేస్తే ఏం లాభం"అని మెత్తగా చీవాట్లు పెట్టాడు.

ఆ రోజంతా పెద్ద బాస్ చాలా సమావేశాల్లో పాల్గొన్నారు. కష్టమర్ల సంతృప్తే సంస్థ లక్ష్యమని తెలియజేసారు. తనింత శ్రమ తీసుకొని ఇక్కడకు వచ్చినది కూడా కష్టమర్లకు మరింత మెరుగైన సేవలందించేలా చూసేందుకేనన్నారు.

ఆఫీసర్లందరినీ కష్టమర్ల సేవ చాలా బాగా చేస్తున్నారని అభినందిస్తూనే, కష్టమర్ల ఆనందం కొరకు ఇంకా బాగా కష్టపడాలని కోరారు.

చివర్న, ఉద్యోగుల యూనియన్ లీడర్స్ పెద్దబాస్‌ని కలిసారు. తమ కోరికల్ని అతని ముందుంచారు. అనేక అలవెన్సులు, ఉచిత రుణాలు కావాలంటూ ఒక వినతిపత్రం సమర్పించారు.

ఈ కోర్కెలు తీరడం ద్వారా ఉద్యోగుల సామర్థ్యం పెరిగి, కష్టమర్లకి ఇంకా బాగా సేవచేయాలనే తాము ఈ కోరికలను కోరుతున్నట్లు విన్నవించారు.

కష్టమర్ల సేవే తన లక్ష్యం కనుక వీటన్నిటినీ సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు పెద్దబాస్ ప్రకటించారు.

చివరికి, పెద్దబాస్ బయలుదేరే సమయం వచ్చింది. రామాపురం ఆఫీసుపై తాను ఇవ్వవలసిన రిపోర్టు కాయితం ప్రొఫార్మా తీయమని స్టెనోకి చెప్పారు. 'కష్టమర్ల సర్వీసే మనందరి ధ్యేయం. ఈ ఆఫీసులో కష్టమర్ల సర్వీసు ఎలా జరుగుతుందో పరిశీలించి, రిపోర్టు నేను ఇవ్వాలి' అన్నారు.

**"పని వత్తిడి ఈరోజుల్లో అందరికీ కామనైపోయింది. నువ్వు టైము- మానేజిమెంటు టెక్నిక్స్ నేర్చుకోవాలి. ఊరకే పని పెండింగ్ వుంచి కంప్లైంట్ చేస్తే ఏం లాభం"**

ఆ ఆఫీసులో జరిగే పనులగూర్చి అనేక ప్రశ్నలు అడిగారు. అక్కడున్న వాళ్ళకి ఆ వివరాలు తెలియలేదు. రామారావే అన్ని ఫైళ్ళూ చూస్తూండడంవల్ల, అతన్ని పిలవక తప్పలేదు. రామారావు పెద్ద బాస్‌కి కావలసిన అన్ని వివరాలూ అందించాడు. అన్ని పనులూ సక్రమంగానే జరుగుతున్నా, అక్కడక్కడ చిన్న చిన్న పనులు ఆలస్యంగా అవుతున్నాయి.

పెద్ద బాస్ రామారావువైపు రౌద్రంగా చూస్తూ 'ఈ పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయి?' నీ సోమరిపోతు తనంవల్ల మన ప్రియతమ కష్టమర్లకెంత ప్రాబ్లం?' అని గద్దించాడు.

తరువాత చిరునవ్వుతో మిగిలిన వారివైపు చూస్తూ ఒక ప్రశ్న అడిగాడు- 'ఇప్పుడీ ఆఫీసులో ఉన్న వాళ్ళందరిలో అతి ముఖ్యమైన వ్యక్తి ఎవరు?'

అందరూ ముక్తకంఠంతో- 'తమరే సార్' అన్నారు.

పెద్ద బాస్ అదే చిరునవ్వుతో వారందరినీ చూస్తూ 'కాదు. నేను కాదు. మహాత్మాగాంధీ ఏమన్నారో తెలుసా?'అన్నారు.


తెలుసు సార్', అంటూ అందుకున్నాడు రామారావు. 'కష్టమరే మన ఆఫీసులో అతి ముఖ్యమైన వ్యక్తి. మన ఆఫీసులో జరిగే పనులన్నింటి లక్ష్యం అతడే. కష్టమర్ సేవ చేయడం ద్వారా మనం అతనికి ఉపకారం చేయడంలేదు. మనకు పనికల్పించడం ద్వారా, అతడే మనకి ఉపకారం చేస్తున్నాడు. అలా అంటున్నప్పుడు- పెద్దబాస్ విజిట్ ఏర్పాట్లకై ఆఫీసంతా తలమునకలై కష్టమర్లని ఎంతలా నిర్లక్ష్యం చేసినది తలచుకొని, రామారావు బాధపడ్డాడు.

కానీ, రామారావు సమాధానం చెప్పడం పెద్దబాస్‌కి నచ్చలేదు. అందరూ తననే 'అతి ముఖ్యవ్యక్తి' అని పొగుడుతుంటే, తను గొప్పగా 'తాను కాదని, కష్టమరని' ఎనౌన్సు చేద్దామని అనుకున్నాడు.

'మధ్యలో వీడొకడు, ప్లానంతా పాడుచేశాడు' అనుకొన్నాడు. పైకి వ్యంగ్యంగా- 'అన్నీ తెలిసేనా నువ్వు అంతమంది కష్టమర్ల పనులు ఆలస్యం చేశావు' అన్నాడు.

తరువాత, చిన్నబాస్ వైపు తిరిగి- 'నేనెంతో నీ పని పట్ల సంతోషంగా ఉన్నాను. కనుక అన్ని పన్లూ సక్రమంగా జరుగుతున్నట్లు రిపోర్టు ఇస్తున్నాను. కానీ ఈ రామారావు సోమరితనం వదలగొట్టే బాధ్యత నీదే' అన్నాడు.

చిన్న బాస్ వినయంగా పెద్ద బాస్‌తో- 'సార్! ఒక విన్నపం. మహాత్ముని ఈ సందేశాన్ని అందరికి కనబడేటట్టు ఆఫీసులో ప్రముఖంగా ప్రదర్శిస్తే బాగుంటుంది' అన్నాడు. పెద్ద బాస్ చాలా సంతోషంగా అంగీకరించాడు. కష్టమర్ల సేవ మన పవిత్రమైన కర్తవ్యమని గుర్తుచేసే ఈ వాక్యాల్ని ప్రముఖంగా ప్రదర్శించే బోర్డు తయారీకి ఖర్చెంతైనా ఫరవాలేదని, పదిహేనువేల రూపాయలు సాంక్షన్ చేశాడు. చిన్నబాస్ ముఖం వికసించింది. ఈ విజిట్ కొరకై పెట్టిన ఖర్చులో కొంతైనా బోర్డు తయారీలో రాబట్టుకోవచ్చు.




ఆ బోర్డు ఎక్కడ పెట్టాలన్న చర్చ వచ్చింది. రామారావు సీటు ముందున్న ఖాళీ జాగాలో పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. 'కానీ, సార్! అక్కడ కష్టమర్లు కూర్చుంటున్నారు. బోర్డు అక్కడ పెడితే కష్టమర్లకు కూర్చునేందుకు ఆ పాటి జాగా కూడా ఉండదు', అంటూ అడ్డు చెప్పాడు రామారావు.

'కష్టమర్లు వచ్చిన వెంటనే వాళ్ళ పని చేయడమే మన లక్ష్యం. వాళ్ళని పనికోసం వేచిచూస్తూ కూర్చోబెట్టడం మన లక్ష్యంకాదు' అంటూ చిన్న బాస్ రామారావు అభ్యంతరాన్ని పక్కకు నెట్టాడు.

మర్నాడు ఘనంగా పెద్ద బాస్‌కి వీడ్కోలు పలికారు. ఆ తరువాత చిన్న బాస్ రామారావుని ఉతికి ఆరేశాడు. 'నీకు గవర్నమెంటు జీతం ఇస్తున్నది ఎందుకు? మన ఆఫీసు పేరు నిలబెట్టడానికి. కష్టమర్ల సర్వీసు బాగా జరుగుతూందనే రిపోర్టు కోసం మేమందరం ఎంత కష్టపడ్డాం? నువ్వు మాకు సహాయపడకపోగా అడ్డుపడతావా? నీకసలు బుద్ధి, జ్ఞానం ఉన్నాయా?'

ఆ తరువాత ఈజీ ఛైర్‌లో వెనక్కి వాలుతూ- 'ఆహా! ఎంత కష్టబడ్డాం! పడితే పడ్డాం గాని కష్టమర్ల సర్వీసు బాగా అవుతుందనే బెస్టు రిపోర్టు కొట్టేశాం. మన ఆఫీసుకి తోటి ఆఫీసుల ముందు ఎంత పేరు?' అనుకున్నాడు తృప్తిగా. ★

---

# పమెల్లాకు కోపమొచ్చింది

వలువలు వదిలేసిందని ఏడుస్తున్నారే గానీ, ఆమె ముఖాన్ని చూడరే. నిండైన సెక్సీ ముఖంలో ఆర్ధంగా పలుకుతున్న భావాలను పసిగట్టరే.




అంటే అన్నానంటారు గానీ, పమెల్లాకు కోపం రావడంలో అర్థముంది. వలువలు వదిలేసిందని ఏడుస్తున్నారే గానీ, ఆమె ముఖాన్ని చూడరే. నిండైన సెక్సీ ముఖంలో ఆర్ధ్రంగా పలుకుతున్న భావాలను పసిగట్టరే. అవన్నీ వదిలేసి కైపెక్కించే లుక్కులు, సెక్సీ స్టిల్స్ ఇస్తున్నావు కనుక, సెన్సార్ కటింగ్ తప్పదంటూ ఎడాపెడా పోస్టర్లను నరికి పారేయడం ఏమైనా బాగుందా!

అవును. నిజమే. పెటా పోస్టర్లలో మీకు నా సెక్సీ భావాలే కన్పించాయని కాసేపు అనుకుందాం. మరి, అభం శుభం తెలియని మూగప్రాణుల బొచ్చు పరపరాలాగేసి, పట్టువస్త్రాలకేసి కుట్టేంస్తుంటే మీకు జాలి కలగడం లేదు. కురులతో మానాన్ని కప్పుకుని మూగగా బతుకుతున్న ఆ ప్రాణుల వలువలు పీకేసి విలువలకు తిలోదకాలిస్తుంటే మీకు సెన్సార్ గుర్తుకురాలేదూ. ఇదేనా మీ ప్రతిభ. ఇదేనా మీరు చదువుకున్నది...

ఈ దండకమంతా హాలీవుడ్ సెక్సీనటి పమెల్లా ఆండర్సన్ చదివిందే. నమ్మండి నమ్మకపోండి. పెటా (పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్) పోస్టర్లపై పమెల్లా ఇచ్చిన స్టిల్స్‌కు చైనావాసులే కాదు, సెన్సార్ అధికార్లు సైతం చప్పున కళ్ళుమూసుకున్నారు. 'మూసిన కళ్ళు తెరవకుండా, అందులో ఏముందో చూడకుండా పెటా పోస్టర్లను ఎడాపెడా కత్తిరించేశార'ని జంతు హక్కుల సంఘం వాళ్ళు గగ్గోలు పెడుతున్నారు. 'శరీరాన్ని నగ్నంగా వదిలేసి, వక్షద్వయాన్ని చేతులతో కప్పుకుని, వెనక్కి తిరిగి (పోస్టర్ చూడొచ్చు. అదీ సెన్సార్ తరువాత) కవ్వింపుగా చూస్తూ.. జంతువులను రక్షిద్దాం అంటూ పిలుపునివ్వడాన్ని ఏమనుకోవాలి. ఇదేం తమాషానా.. ఏంటి' అంటున్నారు బీజింగ్ సెన్సార్ అధికార్లు.

'సరే. వలువలు లేకుండా ప్రకృతిని చూడలేని చైనీయుల విలువలు బాగానే ఉన్నాయి. అందుకు సెన్సార్ చేస్తే చేశారుగానీ, కనీసం పెటా భావాన్నైనా నగ్నదృష్టితో చూడకుంటేవుంటే బావుండేది' అంటోంది అదే నోటితో పమెల్లా ఆండర్సన్.

'ఇంతకంటే ఎక్కువ సెక్సే కళ్ళముందు నడిచి పోతుంటే, అదంతా వదిలేసి పెటా పోస్టర్లపైనే నగ్నత్వం అంతా తాండవించేస్తున్నట్టు ఫీలైపోతారెందుకు చైనా సెన్సార్ అధికార్లు' అంటూ మండిపడుతున్నాడు సంస్థ ప్రచార మేనేజర్ అల్లిసన్ ఈజెల్.

సెక్స్ పోస్టర్లో.... అని ఏడుస్తున్నారు గానీ, పెటా వీడియో ఫిల్మ్ పూర్తి నిడివిచూస్తే అర్థమవుతుంది అసలు విషయం. నరుడి చేతిలో మూగప్రాణులు మౌనంగా అనుభవిస్తున్న గాథలు చూస్తే మెడలు విరిగిపోతాయి. హృదయం ద్రవించిపోయి నీరైపోతాం'అంటోంది పమెల్లా.

ఇవన్నీ మాకెందుకు చెప్పండి. ఇటువంటి ఉన్ని దుస్తుల తయారీ పెద్ద పరిశ్రమగా మారి, యునైటెడ్ స్టేట్స్‌కు ఎగుమతి చేసేస్థాయికి ఎదుగుతోంది చైనా. దీన్ని ఆపమంటే ఎలా' అంటున్నారు వస్త్రవ్యాపారులు. నిజమే ఎవరి వాదన వారిది. తిరిగి వాదించడానికి ఆ మూగప్రాణులకే నోరులేదు పాపం!

-ప్రసూ